

# అద్దం

పి. రామచంద్రయ్య
('మేరీ గోల్డ్')





డాక్ దగ్గర ఆ రోజుకు పని ప్రారంభమయ్యేవరకూ ఉండి, అక్కణ్ణుంచి బస్‌స్టాండుకు దారి తీశాను. ఎనిమిదైంది. డాక్ పనికోసం హడావిడిగా నిర్మించబడ్డ రోడ్డు— రాళ్ల మధ్యా, చివురొత్తటానికై వాతావరణంతో పోరాడి ఓడిపోతున్న మొక్కల మధ్యా ఎర్రగా, గుండెకోతలా దూసుకు పోతూంది. మానవతాస్పర్శకు అలవాటు పడని బంగళాలో, కొత్త పెయింటు సున్నం వాసనలలోంచి పైకొచ్చే ఒంటరి తనానికి చిక్కకుండా తప్పించుకోవా లంటే రోజూ ఉభయ సంధ్యల్లో ఈ రోడ్డును ఆశ్రయించక తప్పటం లేదు నాకు.

ఇద్దరు మేస్త్రీలూ, సూపర్వైజర్లూ, కూలిపనికోసం వచ్చి ఇక్కడే స్థిరపడ్డ సుగాలీలూ, మరికొందరూ బస్‌స్టాండులో రాయచోటి నుంచి వచ్చే బస్సు కోసం ఎదురు చూస్తున్నారు. ఇక్కడ పనిచేసే చిన్నా, పెద్దా ఉద్యోగు లందరూ ఈ బస్సు డ్రైవర్ని బతిమాలి రాయచోటినుంచి తమకు కావలసిన వస్తువులు తెప్పించుకుంటారు, ఈ 'బాహుదా' తల్లి ఒడిలో ఇంకా అంగళ్ళు అవతరించకపోవటంవల్ల. వాళ్లతో పాటు నా లాంటి 'ఏకాంత బాధితులు' కూడా ఇలా పొద్దున్నే బస్‌స్టాండు దగ్గరికి చేరతారు, గదిలోని ఆత్మాశ్రయ భావాల పొగలోంచి బయటపడి జీవిత యథార్థాల సూర్యరశ్మిలో నిలుచుకోవ టానికి.

ఆ ఇద్దరు మేస్త్రీలుకూడా బస్సు మోసుకొచ్చే చైతన్యంలో కాసేపు మునక వేయటానికి వచ్చిన వాళ్లే. న్యాయంగా ఈపాటికి వాళ్లు ఇక్కణ్ణుంచి చుండుపల్లె వరకూ వేయిస్తున్న రోడ్డు దగ్గర పని చేయిస్తూ ఉండవలసింది; ఇక్క డున్నారు. నన్ను చూడగానే అందరితో బాటు లేచి నిలుచుని, తప్పు చేస్తూ పట్టుబడి పోయినట్లు మొహం పెట్టారు.

నేను వాళ్లను చూచీ చూడనట్లుగా మరో పక్కకు వెళ్లి, "నాయకుడూ!" అని కేకేశాను అల్లంత దూరాన ఉన్న ఓ సుగాలీని. ఇక్కడ సుగాలీల్లో మగవాణ్ని 'నాయకు'డనీ, ఆడదాన్ని 'పాపిడీ' అని పిలవటం అలవాటు. ఈ 'నాయకుడు' రంగా దగ్గర పని చేస్తున్నాడు.

అతడు దగ్గరికి రాగానే, "రంగా వచ్చాడా రాత్రి?" అని అడిగాను.

లేదన్నట్లు తల ఊపాడు నాయకుడు. "నా కేం తెలుస్సామీ? చెబితే మీకే చెప్పుండాల. . . ఎంతసేపూ పుస్తకాలు చేతులో బట్టుకొని బొయ్యి ఆ కానగ చెట్లకింద జేరటం— లేకపోతే ఇంట్లో కొచ్చి ఆ అద్దం ముందర నించుకో మండడం— ఉన్నట్టుండి బయటికొచ్చి

తాళాలు నా చేతుల్లో యేసి పొయ్యి బస్సులో గూచోడం. . . ఏందో తిక్క సామీ.''

బస్సు వచ్చింది.

రాయచోటినుంచి తాము తెమ్మని చెప్పిన వస్తువుల కోసం జనం డ్రైవరు చుట్టూ మూగారు. బస్సులోంచి దిగిన వాళ్ళు ఎక్కువ మంది లేరు— వడితాడు, జంగంపల్లె, రాయవరం నుంచి వచ్చే పనివాళ్ళూ, డామ్ నిర్మాణాన్ని చూడటానికి వచ్చిన ఒకటి రెండు బృందాలూ తప్ప.

రంగా రాలేదు. కాని, నేను ఎదురు చూసేది అతడి కోసం కాదు. ఉత్తరాల కోసం. ఇక్కడున్న మా ప్రవాస జనం కోసం ఒక పోస్టాఫీసు పెట్టండో అని పోస్టల్ అధికారులకు వ్రాస్తే, ఇదిగో ఇదిగో అంటూ సతాయిస్తున్నారు వాళ్ళు. అందుచేత ఇక్కడికి ఉత్తరాలు చుండుపల్లె నుంచి రావాలి. ఈ బస్సు అక్కడ ఆగినప్పుడు అవన్నీ తెచ్చి డ్రైవరు కిస్తాడు పోస్టుబంట్రోతు. బస్సు కదిలేలోగా అలా తెచ్చి ఇవ్వకపోతే ఆ రోజున మేము పదిన్నరకు డొక్కుబస్సు వచ్చేదాకా ఉత్తరాల కోసం ఎదురు చూడటం తప్పదు.

దగ్గరలో ఉన్న 'పింఛా' డామ్ ఈ ప్రాంతపు రైతులందరికీ ఉపయోగకరం కాకపోవటంతో, ఇక్కడ 'బాహుదా'పై చిన్న డామ్ నిర్మాణం తలపెట్టి, 1966 లోగా పూర్తి చెయ్యాలని సంకల్పించింది ప్రభుత్వం. నాకు కూడా అంచనాకు కాస్త ముందుగానే ఇది పూర్తిచేసి ప్రముఖుల మెప్పు పొందాలని ఆశగా ఉంది. అందుచేత ఈ రోజు పని నిన్న, రేపటి పని ఈ రోజు పూర్తి చేయిస్తున్నాను.

ఏటిలో ఇసుక తప్ప నీరు లేదు. కాని, డామ్ కట్టవలసిన ప్రాంతమంతా, ఆ ఇసుకలో పెద్ద పెద్ద బండలు కూరుకుపోయి ఉండటం వల్ల, ఆ బండల్ని మధ్యాహ్నం వేళల్లో డైనమైట్ పెట్టి పగల గొట్టిస్తున్నాను. ఈ రోజున డైనమైట్ పెట్టవలసిన ప్రదేశాలు నిన్ననే ఎన్నిక చేసి పనివాళ్ళకు చెప్పేశాను. ఇక్కణ్ణుంచి ఏటి మీదుగా కుడుంవాళ్ళపల్లె దాకా వేస్తున్న రోడ్డుకు తూములు పెట్టే తతంగాన్నికూడా నిన్ననే పర్యవేక్షించి వచ్చాను. దగ్గరున్న సామగ్రికన్నా ఎక్కువ పనికి ప్లాన్ సిద్ధంగా ఉంది.

అందుచేత ఈ రోజు నేను చెయ్యవలసిందేమీ లేదు. బంగళాకు చేరగానే ఫ్లాస్కులోని కాఫీ పోసుకు తాగి పడక మీద వాలాను. ఇప్పట్నుంచి పదిన్నర దాకా ఉత్తరాలకై నిరీక్షణ. అయినా ఏం లాభం? వ్రాయక, వ్రాయక జయ ఉత్తరం వ్రాసినా, ఆ ఉత్తరంలో వెచ్చదనం ఉంటుందన్న ఆశ లేదు. ఏకాంతపు తలగడామీద స్రవించే దుర్బల స్వప్నాల నిండా నిరాశా శైత్యం పేరుకుంటూంది.

ఈ శైత్యంలో అణగారిపోయిన ఆ నాటి తరుపోద్రేకాలూ, జయ కళ్ళలో మెరిసే నిర్లక్ష్యం, ఆమె పట్ల నేను సృష్టించుకున్న పసితనపు ఆరాధనా భావం, ఆమె వెంట తిరిగి ప్రశంసా శ్రావ్యమైన చిరునవ్వులు సంపాదించాలని తహతహలాడటం — ఇలాంటివన్నీ గుర్తొస్తుంటాయి నాకు. అప్పట్లోనే ఒకసారు జయ ఉపదేశంతో నగరంలోని కాలేజీ విద్యార్థులందరినీ కూడగట్టి సమ్మె చేయించినందుకు మా ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ నన్ను వారం రోజుల పాటు సస్పెండ్ చేసి, త్వరలో కాలేజీ లోంచే డిస్మిస్ చేసే ప్రయత్నంకూడా చేస్తానని హామీ ఇచ్చాడు.

"భయపడకు. నిన్ను డిస్మిస్ చెయ్యటమే జరిగితే అందుకు నిరసనగా నేనూ చదువు మానేస్తాను'' అంది జయ. యథాప్రకారం ఆ కళ్ళలోంచి చిమ్మిన రాజసమైన నిర్లక్ష్యంవాంఛ లురగిలించగా, త్రిలోకాధిపత్యం వెంటనే వహించాను నేను. ఆ సాయంత్రం హాస్టలుకు వెళ్ళినప్పుడు నా సహాధ్యాయి కీ విషయం చెప్పాను, గర్వంగా.

"ఇద్దరి భవిష్యత్తూ పాడవుతుంది'' అన్నాడు నా సహాధ్యాయి, జోస్యం చెబుతున్నట్టుగా. అప్పటికి మూడేండ్ల సహజీవనంలో అతణ్ణి గురించి నేను ఊహించిందేమిటంటే, అతడు వృద్ధాప్యంలో ఉన్నవాళ్ళకన్నా ఎక్కువ పెద్దరికాన్ని ధరించి, జీవితాన్నొక 'బూచి'గా చూపించటం ద్వారా చుట్టూ ఉన్న వాళ్ళను జడిపిస్తూ ఏదో అనారోగ్యకరమైన సంతోషమనుభవింప జూస్తుంటాడని.

అంతటితో ఊరుకోకుండా అతడు, "అయినా, ఆవిడ చదువు మానేసినప్పటి మాట. . . బి. ఎ. చదివేటప్పుడుకూడా ఒక ఆనర్సు విద్యార్థి కిలాగే చెప్పి సమ్మెల్లోకి దించి, తీరా అతడు డిస్మిస్ అయ్యాక తను మానెయ్యలేదట'' అన్నాడు.

ఇక అతడితో సంభాషణ పొడిగించలేదు నేను. కానీ, బాధ పడ్డాను. వీళ్ళ కోవకు చెందిన ఏ మహాశయుడి చేత సృష్టించబడ్డదో ఈ వదంతి! దీనికి వీళ్ళు మీసాలూ గెడ్డాలూ పెట్టి శాయశక్తులా ప్రచారం ఇస్తున్నారు. . .

అదృష్టవశాత్తూ నన్ను కాలేజీలోంచి డిస్మిస్ చెయ్యలేదు. ఆ సంవత్సరం ఎలాగో వేగించి ఇంజనీరింగ్ పాసయ్యాను. నన్ను డిస్మిస్ చెయ్యకపోయినా జయ చదువు మానేసింది. చెప్పినా వినలేదు. "బి. ఎ. అయినాక మూడేళ్ళు ఇంట్లో కూచోటంవల్ల విసుగెత్తి మార్పు కోసం చదివిన చదువిది. మళ్ళీ మార్పు కోరుతోంది ప్రాణం. కొన్నాళ్ళింటి పట్టున ఉండనీ'' అంది, నా పరీక్ష అయ్యాక మే మిద్దరం రైల్లో వాల్తేరు వెంచి వస్తున్నప్పుడు. సామర్లకోట స్టేషన్‌లో తను రైలు దిగుతున్నప్పుడు నేను దిగులుమొహం పెడితే, "ఏడవకు, సెంటిమెంటల్ ఫూల్! పెళ్ళి చేసుకుందాంలే. నీకు ఉద్యోగం రానీ'' అంది. కళ్ళలో అదే నిర్లక్ష్యం.

ఆ నిర్లక్ష్యం, ముక్తసరితనం ఇటీవల ఉత్తరాల్లోకూడా ఎక్కువవుతున్నా యని నా బాధ.


పదకొండయింది. తలుపు తోసుకుని నాయకుడు లోపలికి వచ్చాడు, ఉత్తరాలతో. తీసుకుని ఆవురావురంటూ విప్పాను జయ వ్రాసిన ఉత్తరం.

అంతా మామూలు ధోరణే. "క్షేమంగానే ఉన్నాము. నీ ఆరోగ్యం జాగ్రత్త. . ." ఛీ! ఆరోగ్యం ఏం చేసుకోను, మనస్సును ఆరోగ్యంగా ఉండనివ్వనప్పుడు?

నాయకుడు వెళ్ళిపోయాడు.

ఉత్తరం కోసం ఎదురు చూచినప్పటి ఉత్సాహం ఇప్పుడు లేదు. బరువుగా ఘనీభవించే ఒంటరితనం, స్ఫాటిక స్వచ్ఛంగా ప్రవహించే ఏదో జీవనావేశాన్ని స్తబ్దం చేసి, ఆకలిని తాత్కాలికంగా అణిచివేసింది. భోజనం తీసుకురానక్కర్లేదని ప్యూన్‌కు చెప్పి, బంగళాకు తాళం వేసి ముడుంపాడు రోడ్డంట నడిచాను. ఆ రోడ్డుపక్క ఉన్న రహదారి బంగళాలో భాగమైన ఒక గదిలో రంగా నివాసం. నడుస్తూ ఆ గదివేపు చూశాను. నా దగ్గర్నుంచి వెళ్ళిన నాయకుడు అప్పుడే అక్కడ తయారై ఆనందంగా బీడీ దమ్ము లాగుతున్నాడు.

నన్ను చూడగానే బీడీ పారేసి నిలుచుంటూ, "పూసలోళ్ళ చిన్నప్పా వాళ్ళ కుటుంబమంతా ఎల్లబారి తిరపతికి బోయినారంట, సామీ! అందురూ ఇందాక బస్సులో దిగుతూ ఉంటే చూసి మాట్లాడిస్తి. వాళ్ళకు మా అయ్య కనబడినాడంట, తిరపతికొండమీద. సాయంత్రం బస్‌లో వస్తానన్నెప్పాడంట'' అన్నాడు.



సమాధానంగా తల ఊచి ముందుకు సాగాను. మెట్ల దగ్గరికి వెళ్ళేసరికి, అక్కడ బుల్‌డోజర్లు రొద చేస్తున్నాయి. కూలీలు పని చెయ్యటం మాని ఖుషీగా కబుర్లు చెప్పుకుంటున్నారు. దగ్గరి కొస్తున్న నన్ను చూచి వాళ్ళలో ఎవడో మిగతా వాళ్ళకు సైగ చేసినట్టున్నాడు— వాళ్ళందరి మొహాలూ ఒక్కసారి నా వైపు తిరిగి మళ్ళీ అటు తిరిగి నిశ్శబ్దాన్ని ఆశ్రయించాయి. నాకు కోపం వచ్చిన మాట నిజం. వీళ్ళు రోజూ చుట్టుపట్ల ఊళ్ళనుంచి కొండల్లో రాళ్ళలో నడిచి ఇక్కడికి పనికి రావాలి కాబట్టి, ఆ విషయాన్ని ఇటీవల చీఫ్ ఇంజనీర్ ఇక్కడికి వచ్చినప్పుడు ఆయనతో చెప్పి వీళ్ళ కూలి రోజుకు రూపాయిన్నర ఎక్కువ చేయించాను. కాని, అలా చేసినందుకు వీళ్ళు నాకు మాట దక్కించేలా లేరు.

ఈ కోపాన్ని అధఃకరిస్తూ కనపడిన

**పరీధావి**

**దీపావళి కథల పోటీలో**

**రెండవ బహుమతి పొందినది**

మరొక తమాషా ఏమిటంటే, ఆ ఇద్దరు మేస్త్రీల్లో ఒకడు, పొద్దున్నే రోడ్డుపని చేయించటానికి వెళ్లినవాడు, ఇక్కడ తయారై, బుల్‌డోజరుమీద ఎక్కి పరమానందంగా సవారీ చేస్తున్నాడు. నేను డామ్‌కు ఇంజనీరుగా వచ్చిన కొత్తలో, ఒక రోజు ఏరియానంతటినీ సర్వేచేస్తూ దగ్గరలో ఉన్న రాయవరం వెళ్లి,అక్కడ ఫోర్తుఫారమ్‌తప్ప ఎందుకూ కొరగాకుండా తిరుగుతున్న వీణ్ణి చూచి ఇక్కడికి తీసుకొచ్చి మేస్త్రీ ఉద్యోగం ఇచ్చాను. ఈ కొద్ది రోజుల్లో నాకు తెలిసిందేమిటంటే, వీడికి మేస్త్రీపని కన్నా, ఏదో ఒక వాహనం మీద తిరగడమంటే మోజని. అది కారో, బస్సో, లారీయో, స్కూటరో, ట్రాక్టరో, ఆఖరికి బుల్‌డోజరో— ఏదైనా సరే, వాహనంమీద వెళ్లి చేయవలసిన పనేదైనా ఉంటే వెంటనే తయారవుతాడు, రోడ్డుపనికి నామం పెట్టి. ఆ రోడ్డుపని పూర్తికానిదే, ఇక్కడ కావలసిన కట్టడపు సామగ్రి తెప్పించుకోవటం కష్టం. ఇక్కడ బుల్‌డోజరు త్వరగా పని చెయ్యకపోతే ఆ సామగ్రికి కావలసిన 'బేస్' తయారు కాదు. వీడు తన చాపల్యంతో ఈ రెండు పనులూ పాడుచేస్తున్నాడు.


మేస్త్రీని పిలిచి నాలుగు తిట్టి రోడ్డు దగ్గరికి తరిమాను. బుల్‌డోజరు డ్రైవర్నికూడా తిట్టి, ఇకమీదట వీణ్ణి సీట్లో కూచోనీయవద్దని హెచ్చరించి అక్కణ్ణించి బయలుదేరాను. అవసరమైన దానికన్నా కాస్త ఎక్కువగానే దులిపి పెట్టున్నాను వాళ్లని. అదంతా జయ ఉత్తరంలోని శైతల్యం సృష్టించిన చిరాకు ప్రభావం.

తిరిగి బంగళాకు వెడుతూ రంగా గదివైపు చూశాను. నాయకుడు గది గోడకు చేరగిలబడి నిద్రకూ, జాగృతికీ మధ్య వేకారుతున్నాడు.

మూలవిరాట్టు లేని శిథిలాలయంలా కనిపించింది నా కా గది. రంగా త్వరగా పెళ్లాడి ఒకింటి వాడైతే మంచి జీవితం గడపగలడేమో? లక్షాధికారి కొడుకు, అందగాడు, అంతో ఇంతో చదివినవాడు, బంగారు హృదయమున్నవాడు— అతడు కోరుకోవాలేగాని సార్వభౌమంగా ఉన్న సంబంధాలు రావా?

1955 లో నని జ్ఞాపకం— రంగా తల్లిదండ్రులు తమ స్వస్థలమైన విజయవాడనుంచి ఓ సంవత్సరం వెంకటేశ్వరుని సన్నిధానంలో గడపటానికై తిరుపతికి వచ్చి మా ఇంటి పక్కనే ఓ పెద్ద ఇంట్లో కాపురం పెట్టటంవల్ల, మా కుటుంబానికి వాళ్లతో సఖ్యత ఏర్పడింది. అప్పట్లో రంగా విజయవాడ కాలేజీలో ఇంటరు చదువుతున్నాడు. అతడు ఇంటరు పాసై ఆనర్సులో చేరబోయేటప్పుడు, వాళ్లు తిరుపతిలో మకాం ఎత్తేసి వెళ్లిపోయారు.

మళ్లీ నాకు రంగా కనిపించటం ఆరు నెలల కిందట. వారం రోజులు జయతో గడిపి వద్దామని సామర్లకోటకు వెడుతున్నప్పుడు విజయవాడ స్టేషన్‌లో పెరిగిన గెడ్డంతో, మీసాలతో, మాసిన చూపులతో కనిపించిన రంగాను నేను మొదట్లో పోల్చుకోలేదు. అతడే పలకరించాడు. మాటల సందర్భంలో, తను ఆనర్సు పూర్తి చెయ్యలేదని చెప్పాడు. నే నతడికి నా కథ అంతా చెప్పాను, జయను పెళ్లాడబోతుండటం సహా.



ఫోటో—ఆర్. ఉదయభాస్కర్ (తిరుచి—14)

రైలు కదిలింది. నా తిరుగు ప్రయాణంలో మళ్లీ ఈ స్టేషన్‌లో కలుస్తానని చెప్పాడు రంగా.

సామర్లకోట చేరాక ఒక రోజు జయతో రంగాను గురించి చెప్పాను.

"అతడి పూర్తి పేరు?" అంది జయ.

"తాళ్లపూడి శ్రీరంగ" అంటూ వర్ణించి వివరాలు చెప్పి, "నీకు తెలుసా?" అన్నాను.

"అయ్యో, తెలీకేం? హీరో. . . ఆయనగారి వీరకృత్యాల్ని భరించలేక కాలేజీనుంచి వీడ్కోలిచ్చి పంపారు."

"వీరకృత్యాలు మనమంతా చేసేవేగా, జయా? అవి లేకుంటే యూనివర్సిటీ జీవితంలో చురు కేముంటుంది?" అన్నాను.

"అలాంటివి కావులే ఇవి. . . ఒకటి కాదు చెప్పటానికి" అంది జయ. ఆమె అసహ్యించుకుంటున్నట్టూ, అంతకన్న ఎక్కువగా ఈ విషయం చర్చించి విలువైన క్షణాల్ని వ్యర్థం చేయదలుచుకోనట్టూ గ్రహించి సంభాషణ మార్చేశాను.

నా తిరుగు ప్రయాణం ఫలానా రోజని చెప్పి ఉండటం వల్ల, రైలు విజయవాడ స్టేషన్‌లో ఆగేసరికి అక్కడ సిద్ధంగా ఉన్నాడు రంగా. అతడి పట్ల నా వైఖరి జయ చెప్పిన మాటల వల్ల ప్రభావితం కాకుండా ఉండేట్టు చెయ్యాలని తంటాలు పడ్డాను నేను.

"జీవితం విసుగ్గా ఉంది, సుబ్బా! ఏదో సాధించాలని మనం అనుకుంటాం గాని, ప్రతి క్షణానా మన అల్పత్వాన్ని ఎత్తి చూపే అనంత భువనాల్లో ఈ సాధించడాలన్నీ ఏపాటి?" అన్నా డతడు. మనిషికి వేదాంతం తల కెక్కిందని నే ననుకుంటున్నంతలో మళ్లీ, "నువ్వేదో 'మిన్నుళు పడ్డచోట' పని చేస్తున్నానన్నావుగా! కొన్నాళ్లక్కడి కొచ్చి ఏకాంతంగా గడపాలని ఉంది, సుబ్బా! అక్కడ నీ కేం కష్టాలు కొనుక్కురానులే, భయపడకు" అన్నా డతడు.

అన్నంత పని చేశాడు, మూణ్ణెల్ల కిందట. ఇక్కడ నే నతడికి రహదారి బంగళా ఎదుట ఉన్న గది ఇప్పించాను కాని, అతడి కా గది అంతగా అవసరమైనట్టు లేదు. పగలంతా వేదాంత గ్రంథాలతో, ఏటి ఇసుకలో కూరుకుపోయి పైకి కొద్దిగా కనపడే బండలమీదో, కావగచెట్ల కిందో గడపటం, లేదా గదిలో అద్దం ఎదుట నిలుచుకోవటం, లేదా బస్సెక్కి రాయచోటికో, పీలేరుకో వెళ్లి రావటం— ఇదీ వరస.

జయ ఉత్తరం ధాటికి అణిగిన ఆకలి మళ్లీ ఇప్పుడిప్పుడే మేల్కొంటూంది. కాని, భోజనం అక్కర్లేదని కబురు చేసి ఉండటం వల్ల, కారియర్ రాలేదు. బిస్కట్లపొట్లం ఒకటి విప్పి తిని, నిన్న రాయచోటినుంచి తెప్పించుకున్న బేరిపండ్ల ముక్కలు కొరుకుతూ కూచున్నాను.

• • •

సాయంత్రం బస్సులో రంగా వచ్చాడని తెలిసింది. పెందరాళే భోజనం చేసి అతడి గదికి బయలుదేరాను.

లక్ష్యంలేని బాణంలాంటి అతడి జీవన పద్ధతి అతడికి గాని, అతడితో సన్నిహితంగా ఉన్న నాకుగాని శ్రేయస్సు చేకూర్చేది కాదు. జయ ఇదంతా ముందుగానే గ్రహించినట్టుంది— రంగా ఇక్కడికి రాకముందు, అతడు రాబోతున్నాడని నేను వ్రాస్తే తీవ్రంగా అసమ్మతి తెలిపింది. అందుకు జవాబుగా— నేను సంప్రదాయ కుటుంబపు నియమనిష్ఠల్లో పెరిగినవాణ్ణి కాబట్టి, తను ఎలాంటి భయాలూ పెట్టుకోనక్కర్లేదని వ్రాశాను. కాని, ఆ జవాబు జయను తృప్తిపరిచినట్టు లేదు, అప్పట్నుంచీ ఆమె అరుదుగా వ్రాసే ముక్తసరి ఉత్తరాలనుబట్టి చూస్తే. . .

గదిలో అడుగు పెడుతూనే, "రాయవరం బస్సులో వచ్చావా?" అని అడిగాను రంగాను.


జవాబు లేదు. అతడు తాగి ఉన్నాడని స్పష్టంగా తెలుస్తూంది.

"సలహా లిచ్చే వయస్సు కాదు నాది. కాని, నీ విలా ఉండటం నాకు బాధ కలిగిస్తూంది, రంగా! ఎన్నాళ్ల కిందట నువ్వీ దారి తొక్కావో తెలీటం లేదు. . . అసలు ఆనర్సెందుకు మానేశావు?" అన్నాను.

"మానలేదయ్యా! మానిపించారు."

"ఎందుకు?"

"మనుషుల్ని నమ్మినందుకు. ఇచ్చి నమ్మేలోకి దింపిన మనిషి పుటుక్కున గంగలో ముంచేసరికి, విరక్తి




పుట్టుకొచ్చింది, బ్రదర్'' అన్నాడు. అనుమానాల సుడిగాలుల్లోంచి భయం రివ్వున తాకింది నా మొహానికి.

"ఆ మనిషెవరో కాదు— మా జయ" అని ప్రారంభించాడు మళ్ళీ. "ఇదిగో, ఈ అద్దం చూశావా? ఒక్క చోట మాత్రం కొద్దిగా మిట్టపల్లాలున్నప్పటికీ, మనుషుల మొహాల్నీ, రంగుల్నీ, అంతరంగాల్నీ ఎలా ప్రతిబింబిస్తోందో చూడు. అప్పట్లో ఓ మధ్యాహ్నం బజారు కెళ్ళి ఏరి ఏరి కొన్నాను, జయకు ప్రజెంట్ చేద్దామని. నే చేసిన తప్పేమిటంటే, తరవాత ఆ ఉద్దేశాన్ని మార్చుకోవటం... నువ్వైనా దీన్ని జయ కివ్వు, మీ పెండ్లి రోజున."

తీసుకోవటానికి తటపటాయించాను.

"ఊఁ!" ఉరిమాడు రంగా, కళ్ళు చింతనిప్పులు చేసి. భయపడి, మాట్లాడకుండా అద్దం అందుకున్నాను.

నా కా రాత్రి నిద్ర లేదు. జయ మీద కోపం వచ్చింది, కుర్రతరహాగా ఇలాంటి పనులు చేసి బెడద తెచ్చిపెట్టినందుకు. పోనీ, ఇవన్నీ నాతో ముందే చెప్పకూడదూ? మళ్ళీ భయం, నేను అపోహలు పడతానని.

రంగా ధోరణి మాత్రం అమానుషంగా ఉంది. జయ చేసింది తప్పే కావచ్చు. కాని, తను కాలేజీలోంచి డిస్మిస్ అయినందుకు జయకూడా చదువు మానాలని ఇతడు పట్టు పట్టడం ఎంత నీచం!

మర్నాడు పొద్దున్న అత డిచ్చిన అద్దాన్ని బల్లమీద నిలిపి దానిమీద ఉన్న సిల్కు కవరు తొలగించాను. అద్దంలో కొద్దిగా మిట్టపల్లాలున్న ఒక్క చోట తప్ప మిగిలిన భాగంలో నా ప్రతిబింబం స్వచ్ఛంగా, పారదర్శకంగా కనపడుతూంది. ఉద్యోగంలో చేరాక నా ఒళ్ళూ, బుగ్గలూ తేలువద్దాయని చాలా సార్లన్నది జయ ఇటీవల.

సాయంత్రం మళ్ళీ రంగా గదికి వెళ్ళాను— ఇక్కణ్ణుంచి తక్షణం మకాం ఎత్తేయమని చెప్పటానికి. పాత కుచ్చితాల అవశేషాలు ప్రేరేపించి ఉండకపోతే అతడిక్కడికొచ్చి ఇన్నాళ్ళ మకాం పెడతాడా?

నే వెళ్ళేసరికి గది తాళం వేసి ఉంది. రంగా రాయచోటికి వెళ్ళాడని చెప్పాడు అక్కడే ఉన్న నాయకుడు.

"ఛ ఛ! తాగుడు. మీ అయ్యను పాడు చేసేస్తోంది. ఏదీ, గది తాళం తియ్యి. ఆ పాడు సీసాలన్నీ తీసి బయట పారేస్తాను ... మీ అయ్య కనుక్కోలేడులే" అన్నాను.

నాయకుడు గది తాళం తీశాడు.

రంగా నిజస్వరూపాన్ని బయటపెట్టే కాగితాలుగాని, మరేవైనా ఆధారాలుగాని గదిలో ఉండవచ్చునని నా నమ్మకం. అందుచేత గబగబా లోపలికి వెళ్ళి, సీసాల కోసం వెదుకుతున్నట్టు నటిస్తూ, ఓ మూల ఉన్న ట్రంకు తెరిచి దానిలోని కాగితాలూ, ఉత్తరాలూ బయటికి తీశాను. అవి ఒక్కటొక్కటే తీసి చూస్తుంటే, ఒక కవర్లోంచి ఫోటో ఒకటి కింద పడింది. ఆ ఫోటో జయది! కవర్లో ఓ ఉత్తరంకూడా ఉంది. తీసి చూశాను. ఆ దస్తూరికూడా జయదే!

"నీతోబాటు చదువు మానెయ్యక పోయినా, ఆ ఏడు నేను బి. ఎ. తప్పాను గదా! ఇంకా కసి తీరలేదా, రంగా? నీకువిశాలభావాలున్నాయనిభ్రమించాను గాని, ఇలా చేస్తావనుకోలేదు. ఇన్నాళ్ళూ పెళ్ళి చేసుకుంటావని ఆశ చూపి ఇప్పుడిలా చేస్తున్నావు. నువ్వు చెప్పే కుంటిసాకు లెంత అసహ్యంగా ఉన్నాయో నీకు తెలీటం లేదా? నువ్వు మగాడివేనా?"

పళ్ళెంలో సంపెంగపువ్వులా పెట్టి జీవితాన్ని అందిస్తే, అందుకున్న మగాడు ఘాతకుడై దాన్ని ఆఘ్రాణించి నలిపి పారవేసినప్పుడు విలవిలలాడే ఆత్మ చేస్తున్న ఆర్తనాదం అది!

ఇక చదవలేకపోయాను. ఉత్తరాన్ని పెట్టెలోకి విసిరికొట్టి ఎప్పటిలా సర్దేసి, బయటికి వచ్చాను. గదిలో సీసాలేమీ కనపడలేదని నాయకుడితో చెప్పి బంగళాకేసి నడిచాను.

ఉత్తరాన్ని పూర్తిగా చదివి ఉంటే రంగాగారి దక్షిణ నాయకత్వాన్ని గురించి మరెన్ని విషయాలు తెలిసేవో? కాని, ఆ క్షణం వేడిలో నా కాపాటి ఆలోచన రాలేదు. మళ్ళీ ఎప్పుడైనా వీలు చూచుకుని ఆ పని చెయ్యాలి.

జయపై కోపం రాలేదు నాకు. ఉన్నదంతా జాలి— అమాయికంగా కాలు జారి, ఆ వ్యథావృత్తాంతాన్ని నాకు చెబుదామన్నా చెప్పలేని దయనీయస్థితిలో ఉన్నందుకు సానుభూతి— ఈ మారు జయ దగ్గరికి వెళ్ళినప్పుడు, గాయపడిన ఆ హృదయానికి వాత్సల్య లేపనం అద్దాలన్న ఆత్రతా.

తరవాత రెండు రోజుల పాటు రంగా గదికి వెళ్ళలేదు నేను. ఇక జీవితాంతం అతడికి అపరిచితుడులా ఉండటం మంచి దనుకున్నాను. కాని, మూడో రోజు, ఉదయాన, బాహుదా నది ధనుస్సులా వంపు తిరిగే చోట పేరుకున్న రాళ్ళన్నీ ఆ సాయంత్రానికి పగలగొట్టించేద్దామని డైనమైట్ పెట్టిస్తూంటే, అక్కడ అవతరించాడు రంగా.

"ఏమనుకోకు, బ్రదర్... ఆ రోజు రాత్రి కొంచెం గుర్రమెక్కి ఉండటం వల్ల కాస్త వదులుగా మాట్లాడినట్టున్నాను" అన్నాడు.

"మాట్లాడినందుకు నా కేం దుఃఖం లేదు. కాని, ఆ గుర్రం శ్రీ కృష్ణ జన్మస్థానంలోకి పరుగెత్తకుండా కళ్ళెం వేసుకోవటం మంచిది" అన్నాను.

"వేసుకుంటూనే ఉన్నాను, బ్రదర్, ఇప్పటిదాకా... కాని, మనం క్రియలో ఎంత జాగ్రత్తగా ఉన్నా, మనస్సు అప్పుడప్పుడూ పాపం చేస్తుంటుంది — చూశావా? ఆ విధంగా చేసిన ఏ పాపం వల్లనైనా నా వల్ల ఏ కన్యాయం జరిగిందేమోనని, దాన్నుంచి విముక్తి పొందటానికై ఇన్నాళ్ళూ ఇక్కడి కొచ్చి ఉన్నాను నేను."

ఈ మాటలు నిజంగా ఉద్దేశించినదో, లేక క్రూరమైన అంతరార్థమేదైనా వాటిలో ఇమిడి ఉందో అర్థం కాలేదు నాకు. కాని, నాకు అన్యాయం చేశానని ఇతడు నిజంగానే అనుకుంటున్నా, ఆ అన్యాయానికి పరిహారం లేదు. తను శ్రీమంతుడు గనక డబ్బిచ్చి నన్ను సంతోషపెట్టవచ్చు ననుకుంటున్నాడా? ఛీ!

నేను జవాబివ్వలేదు.

"ఇలా చూడు, బ్రదర్... ఏం, మధ్యాహ్నం ఈ బండల్లో డైనమైట్ పెట్టించబోతున్నావా?" అన్నాడు.

ఈ ప్రశ్నతో నిజంగా డైనమైట్ లాంటి ఆలోచన వచ్చింది నాకు.

"లేదు" అన్నాను.

"అయితే బతికించావు... లేకపోతే మధ్యాహ్నం ఆ బండలమీద కూచుని కాసేపు మౌనం అనుభవించే ఆశ లేకుండా పోయేది. సరేకాని, నే నిచ్చిన అద్దంలో మొహం చూసుకున్నావా?"

లేదన్నట్టు తల తిప్పాను.

"చూసుకున్నా ప్రతిబింబించేందుకు నీలో ఏముంది, దద్దమ్మవు! అదే జయ లాంటి వాళ్ళు..."

"షటప్!" అని అరిచాను.

• • •

గడియారం మూడు కొట్టింది. ఇక గుండె చిక్కబట్టుకోవటం అసాధ్యమనిపించింది నాకు.

# దీపశిఖలు

## శనగన నరసింహస్వామి

యుగయుగంబుల నుండి దీపోత్సవములు
జరుపుకొనుచున్న భారత జగతిపైన
విరిసెనో గాథతామసి కురిసెనో నవ
కాంతిధారలు మెరసెనో శాంతిలతలు?

భువనభవనంబు లెల్ల నపూర్వదీప
భూషణోన్మాదమున పొంగిపోవు వేళ
ఊరి వెలుపల నెన్నడో దారి తప్పి
బ్రదుకు గుడిసెల గోడవ లెవ్వరికి వలయు?

విశ్వకల్యాణ మంజుల విమలగాన
గోష్ఠి వెక్కసమైపోయె - కులమొ ధనమొ
మిగిలి మకుటము దాల్చె - ఈ యెగుడు దిగుడు
త్రాసు సరికాక కలదె పర్వప్రసక్తి.

దీపమే లేని జనుపాంథ దీన మంది
రాంతరంబుల నగ్ననాట్యంబు ద్రొక్కు
కటికి చీకటి రాకాసి గడపలేక
దివ్యదీపావళియె తల దించుకొనెనె!!!

ఈ మహా పుణ్యదినమున ఏ భయంబు
తలపునకు దట్టెనో - హెచ్చుతగ్గు లెంచి
కులము కులమున కొక్కొక వెలుగు దోప
తేజరిలసాగె మహాంధ్ర దీపశిఖలు! ★

---

నే నేం చేశాను?

ఢాం! ఢాం! డైనమైట్ మోగుతూంది. నా ఒళ్లంతా మైకం కమ్ముతుండగా లేచి బయటికొచ్చి నిలబడ్డాను. నాయకుడు రొప్పుకుంటూ వచ్చాడు.

"మా అయ్యకు పెమాదమై పోయింది, సామీ! డైనమైటు పెట్టించి వారని తెలీక బండలమీదికి పోయి కూచున్నాడంట" అన్నాడు.

"ఆ!"

"పెద్ద బండొకటి పైన బడి రగతం ఎల్లువవుతా ఉంది, సామీ! అణ్ణుంచీ చేతులమింద ఏసుకొస్తా ఉంటే దారి పొడుగూతా ఒకటే రగతం, రగతం. . ."

"అయ్యయ్యో! వెంటనే జీపులో వేసి రాయచోటికి తీసుకెళ్లమని మేస్త్రీతో చెప్పు. నా కోసం ఆగవద్దు" అని నాయకుణ్ణి తరిమాను. నేనుకూడా వెళదామంటే ధైర్యం చాలలేదు. రంగా మొహం చూడట మెలాగ?

బంగళా లోపలికి వెళ్లాను.

రంగా బతకాలి. నా కే పాపమూ అంటకూడదు. జయ వంటి అమాయకపు పిల్లల నిండు జీవితాలతో ఆడుకున్నందుకు అతడి పాపమంతా అతడ దగ్గరే ఉండనీ.

రంగా, ఇచ్చిన అద్దం బల్లమీద నిలుచుని శల్యపరీక్ష చేస్తూంది నన్ను. అద్దమంతా నిర్మలంగా ఉన్నా, కొద్దిగా మిట్టపల్లాలున్న ఆ నలుసంత ప్రదేశం నలుమూలలా విస్తరించి నా ప్రతిబింబాన్ని పాడు చేస్తూంది.

రాత్రయింది. నలుగడలా నిలిపిన విద్యుద్దీపాల మధ్యగా, చిక్కగా కిటికీల్లోంచి గదిలోనికి ప్రవహిస్తూంది చీకటి. రంగాను జీపులో రాయచోటికి పంపి వచ్చాడు నాయకుడు.

"కూచో" అన్నాను. కళ్లలో దిద్దుకున్న గాంభీర్యాన్ని పలుచన చేస్తుందేమోనని, బల్లమీది అద్దంపై కవరు వేసేశాను.

"చాలా దారుణంగా ఉంది, నాయకుడూ! ఒకవేళ మీ అయ్య ప్రాణం తీసుకోవా లనుకోలేదు గదా?" అన్నాను.

"తెలీద్సామీ!"

నాకు బలం చిక్కింది. "వేళాపాళా లేకుండా అత డెప్పుడూ చెట్లకిందా, బండలమీదా కూచుండి పోవటం తలుచుకుంటే నాకు అనుమానం వేస్తోంది, నాయకుడూ!. . . ఏదీ, గది తాళం ఇలా ఇవ్వు, అతడి కాగితాలు చూస్తే ఏమైనా తెలుస్తుందేమో?" అన్నాను. అత డిచ్చిన తాళం తీసుకుంటూ, "మీ అయ్యతో చెప్పకు. అత డసలే దాపరికం మనిషి" అన్నాను.

రంగా గదిలోకి వెళ్లి లైటు వేశాను. కాగితాల పెట్టెలోంచి జయ ఉత్తరాన్ని తీసి, ఆ రోజు చదవకుండా వదిలిన భాగాన్ని చదివాను.

"నువ్వు మగాడివేనా? ఇప్పటిదాకా మనిద్దరికీ శారీరక సంబంధం లేదు కాబట్టి, నువ్విప్పుడు నన్ను పెళ్లి చేసుకోక పోవటం వల్ల నా కేమీ అన్యాయం జరగటం లేదని వ్రాశావు. తప్పక అన్యాయమే— ఇప్పుడు నేను ఇంకొకర్ని ప్రేమించటం జరగదు కాబట్టి. అసలు నిన్ను శారీరక సంబంధం పెట్టుకోవద్దన్న దెవరు? విశాల భావాలు లేకుండ నువ్వు మడి కట్టుకుని కూచుంటే, అది నా తప్పా? ఇటీవలి నీ ఉత్తరాలు చూస్తే, నా గత చరిత్రను గురించి కూపీలు తీస్తున్నావేమో ననిపిస్తూంది "ఒప్పుకుంటున్నాను. బి. ఎ. చదివేటప్పుడు మా క్లాస్‌మేటును ప్రేమించి పెళ్లిదాకా వెళ్లిన మాట నిజమే. కాని, మా నాన్న ఒప్పుకోలేదు, అతడికేం ఆస్తి లేకపోవటం వల్ల. దానికి నే నేం చెయ్యను? అపార్థం చేసుకుంటావేమోనని నీ కిది ముందుగా చెప్పలేదు. క్షమించు.

"నీతో పెళ్లిరాయబారాలు జరుపుతూనే ఇప్పుడుకూడా తిరుపతినుంచి వచ్చిన ఇంజనీరింగ్ విద్యార్థితో ప్రేమ కలాపం సాగిస్తున్నానని ఈ ఉత్తరంలో మరో నేరం మోపుతున్నావు. ఇది అన్యాయం, రంగా! అతడు కేవలం నా స్నేహితుడు. అతడు తిరుపతికి చెందినవాడు కాబట్టి, మనం ఎప్పుడైనా యూనివర్సిటీ పనిమీదగాని, మన పెళ్లయ్యాక హనీమూన్ కోసంగాని తిరుపతికి వెళ్లినప్పుడు పనికొస్తాడనే ఆశతో అతడి పిచ్చినంతా భరిస్తున్నాను."

ఉత్తరంలో ప్రత్యక్షరానా జయ కళ్లు కనవడుతున్నాయి. ఆ కళ్లలో నిర్లక్ష్యం. ఆ నిర్లక్ష్యం తోటి మనుషుల భవిష్యత్తు పట్ల, తనని నమ్మిన వాళ్ల హృదయావేశాల పట్ల, కనీసపు జీవనా దర్శాలపట్ల.

సంపంగి రేకుల వెనక సర్పపుపడగ!

చేతులు ఏ పని చెయ్యటానికీ నిరాకరిస్తుంటే ఆ ఉత్తరా న్నెలాగో పెట్టెలోకి తోసేసి బయటికి వచ్చి చీకట్లో నిలుచున్నాను. దూరాన్నుంచి ఆ చీకట్లను హెడ్‌లైట్లతో కోస్తూ జీపు వచ్చి ఎదుట ఆగింది. జీపులో ముందు సీట్లో కూచున్న మేస్త్రీ నన్ను చూచి కన్నీళ్లు పెట్టుకున్నాడు.

"అంతా అయిపోయింది, సార్! రాయచోటిలో ఆస్పత్రికి చేరే సరికే ప్రాణం లేదు" అన్నాడు జీపులోంచి దిగుతూ.

జీపు దగ్గరికి వెళ్లాలంటే చెప్పరాని భయం వేసింది నాకు. కాని, లోలోపల విజృంభించే సంక్షోభాన్ని నేర్పుగా దాచుకుంటూ, గబగబా రంగా గదిలోకి వెళ్లి, దండెంమీద ఉన్న పంచె ఒకటి తీసి మేస్త్రీ కిచ్చి, దాన్ని శవంపై కప్పమన్నాను. అతడు కప్పాడు. ఆ పంచె రంగా మొహాన్ని కప్పగలిగింది కాని, కాళ్లు మాత్రం బయటికి కనిపిస్తున్నాయి.

అప్పుడు నేను జీపు దగ్గరికి వెళ్లి ఆ పాదాలకు తల ఆనించి, 'ఓ దగా పడిన స్నేహితుడా, నన్ను క్షమించగలవా?' అని నిశ్శబ్దంగా, దొంగతనంగా అడిగాను. అప్పుడుకూడా, ఆ కప్పిన గుడ్డ కాస్త తొలగించి రంగా మొహంలోకి చూద్దామంటే ధైర్యం చాలలేదు. ఆ జీపులోనే శవాన్ని విజయవాడకు చేర్చే ఏర్పాటు చేసి, బంగళాకు బయలుదేరాను.

ఇప్పుడు నా కున్న మరో భయం ఏమిటంటే, బంగళాలోనికి వెళ్లగానే బల్లమీద ఎదురవుతుంది రంగా ఇచ్చిన అద్దం. దానిలో ఆ మిట్టపల్లాలున్న ప్రదేశం ఇప్పుడు మరింతగా విస్తరించి, అద్దం పరిధిని దాటి గది అంతా పరుచుకుంటుంది— నా మొహంలోపలి లోతుల్నీ, ఆ లోతుల్లోని చీకట్లనూ ప్రతిబింబిస్తూ. అది నేను భరించలేను.

అందుచేత, బంగళాలోకి నేరుగా కాకుండా గోడవారగా ప్రవేశించి, అద్దం ఎదుట కాకుండా పక్కగా నిలుచుని, అద్దాన్ని ఒక్క దెబ్బతో పగల గొట్టెయ్యాలి. అదెంత పని! జీవితాన్నే పగల గొట్టగలిగినవాణ్ణి, అద్దాన్ని పగలగొట్టడం ఒక లెక్కా నాకు? ★